# తండ్రి

ప్రేమ విలనై, దయ హీరోఐ ఆంజనేయులు జీవితం రెండు గట్టులకు గట్టిగా కొట్టుకొని, ఏటిలో మునిగిపోకుండా ఈది ఒడ్డెక్కటం ఆశ్చర్యకరమే.

ఆంజనేయులు హనుమంతుడూ కాదు, మహాత్ముడూ కాదు. సముద్రాన్ని లంఘించనూ లేదు.

అతను భూక్యా నాయక్ మనుమడు. ఊరు నరిసినేకుంట తాండా. తల్లీదండ్రీ కాపుసారాయి కేసుల్లో, కొండల్లో, గుట్టల్లో, కొన్నాళ్ళూ, ఎక్సైజ్ పోలీసులు ప్రొహిబిషన్ స్టేషన్లలో కొన్నాళ్ళూ, ఎప్పుడన్నా తాండాలో కొన్నాళ్ళు జీవించి, సారాయి దెబ్బకో, పోలీసుల దెబ్బకో ఆంజనేయుల్ని కన్న నాలుగేళ్ళకే గతించి పోయారు.

ఒంటిగాడయిన భూక్యా నాయక్ ఎదాన అర్భకుడు తల్లిదండ్రులు లేనివాడు ఆంజనేయులు పడ్డాడు. బక్కప్రాణి పిరికివాడు రోగిష్టి పిల్లవాడు తాతవెంటే ఉంటూ అతడి మంచంలో పడుకొంటూ, కంచంలో తింటూ, గోచి పట్టుకొని తిరుగుతుండేవాడు.

పిల్లవాడికి పిచ్చిభయం. రాత్రిపూట ఒంటికి పోవాలన్నా తాతవెంట ఉండాల్సిందే. తాతను నీడలాగే వెన్నంటి ఉండేవాడు. అతడికి తాతే తల్లిదండ్రి గురువుదైవం. తాతకు మొక్కేవాడు కాదు.ఎత్తుకోమని అడిగేవాడు. అయిదేళ్ళ వాడిని ఎత్తుకోలేక గాడిదమీద కూర్చోబెట్టి తిప్పేవాడు. కాలుకింద పెట్టనిచ్చేవాడు కాదు. తాతకు మనమడంటే పిచ్చి ప్రేమ.

వృద్ధాప్యంలో భూక్యానాయక్‌ని సాకేవాళ్లు లేక పోగా, తాను సాకవలసిన పసివాడు ఉండటంతో ఏ చెట్టునీడనో పడి నిద్రపోవలసిన వాడు. మేలుకొని ఉండవలసినవాడు అయ్యాడు. ఊరికే ఉంటే పొట్టగడవదు కాబట్టి పనిచేయవలసి వచ్చింది.

కొండల్లో, గుట్టల్లో, బంజరుల్లో దట్టంగా పెరుగుతున్న సర్కారు కంప కొట్టి, చీల్చి,సైజుగా నరికి మోపులు కట్టి, గాడిదలమీద వేసుకొని నారాయణపురం మీదుగా వచ్చి అనంతపురంలో అయిదోరోడ్డు, నాలుగోరోడ్డు, యువజనకాలనీ, రజకనగర్, శాంతినగర్, ఆర్.కె.నగర్, రంగస్వామి నగర్‌లలో అమ్ముకొనేవాడు భూక్యానాయక్.

ముందంతా అలవాటు అయిన అక్కడికి పోకుండా కొత్తగా మొలచిన తపోవనంలో కంపకట్టెలు అమ్మటం లాభసాటిగా కనిపించింది అతనికి. కాలనీలో అంతా చిన్నా పెద్ద ఉద్యోగస్థులే! ఆదివారమయినా, సెలవురోజయినా, ఇంటిపట్టునే ఉంటారు.

సెలవంటే నాయక్ గాడిదలమీద కట్టెలు మోపులు అటూ ఇటూ వేలాడేసుకొని వచ్చేవాడు. ఒక గాడిదమీద కట్టెలపైన, ఏనుగుమీద అంబారీమీద మహారాజులాగా ఆంజనేయులు కూర్చుని తాతవాటిని తోలుతూ ఉండగా నరిసినీకుంట నుంచి ఉదయమే బయలుదేరి వచ్చేవాడు.

తాత 'కట్టెలు కట్టెలు'అని అరవలేనప్పుడు ఆంజనేయులు అరిచేవాడు. చింతకట్టెలకన్నా వేపకట్టెలకన్నా, తుమ్మకట్టెలకన్నా సర్కారుకంప కట్టెలు ఒక నెలకు సరిపోతాయి. ఆ యింటిలో లెక్కలు తీసుకొని, చెంగుకు కట్టుకొని, బొడ్లో దోపుకొని వాళ్ళు పెట్టిన అన్నం తాతామనమడు తిని, వరండాలో నిద్రపోయి, గేటుకు కట్టిన గాడిదల్ని విప్పుకొని సాయంకాలం బయలుదేరి రాత్రికి ఇంటికి చేరేవాళ్లు వాళ్ళు.

అయిదారేళ్ళ పిల్లవాడు ఊరికే తాత వెంట తిరుగుతుంటే రత్నం. అడిగాడు.

"పిల్లవాణ్ణి స్కూల్లో చేర్చకూడదా?'

'లెక్క యాడ తేవల్ల?'

'ఫీజు ఉండదు. హాస్టలు ఉంటుంది. అన్నం పెట్టి చదివిస్తారు?'

'ఉద్దర సదువా! ఏల? మాకేల సామి? వద్దు దేవుడూ!'

నాయక్‌ని ఒప్పించి, గిరిజన బాలురవసతి గృహంలో చేర్పించి, ఒకటో తరగతిలో పేరు రాయించాడు రత్నం.

ప్లేటులో పిల్లవాడి చేయిలేక, మంచంలో వాడి శరీరం లేక, గాడిదమీద రాజులేక, నాయక్‌కి మతిపోయినట్లుంది. తోడున్న ప్రాణి లేక, ఒంటరివాడయిన అతడికి దిక్కుతోచలేదు.

కొత్తబట్టలు, కొత్తపలకాబలపం,హాస్టలు, జనం, మోజుగానే ఉన్నా తాత గుర్తుకు వచ్చి ఆంజనేయులుకు ఏడుపు వచ్చేది.

ప్రతి ఆదివారం తాతామనమళ్లు తపోవనంలో రత్నం ఇంటిలో సమావేశమై జాతీయ, అంతర్జాతీయ రాజకీయ పరిస్థితులు చర్చించి తీర్మానాలు చేసేవాళ్ళు. ఆ తీర్మానాలు ఇద్దరి కళ్ళలో నీళ్ళై ప్రవహించేవి. ఇద్దరికి అతుక్కొన్న బంక ఊడబెరికి వాళ్ళను వేరుచేసి ఆంజనేయుల్ని హాస్టలుకు, నాయక్‌ని ఊరికి పంపేసరికి రత్నం సెలవు అయిపోయేది. స్వారీచేసే మారాజు లేక గాడిదలు దిగులుగా తోకలూపుకొంటూ వెళ్లేవి.

ఆంజనేయులు ఐదోతరగతి పాసయ్యేసరికి ఆంధ్రదేశంలో ఎవరికీ రానంత చదువు తన మనమడికి వచ్చిందని నాయక్ నమ్మేశాడు.

పదేళ్ళు దాటిన ఆంజనేయులుకు పెళ్లి చేయాలని తాత పట్టుబట్టాడు. ఆంజనేయులు తాత భక్తుడు. తాత ఎంత చెబితే అంత. తన కూతురు కూతుర్ని, మనుమరాలిని కొడుకు కొడుక్కిచ్చి మనుమడికిచ్చి పెళ్ళిచేయటానికి ఏర్పాటు చేయసాగాడు నాయక్. రత్నం ఎన్ని చెప్పినా వినలేదు. పోలీసులకు చెబుతానని, పిల్లల పెళ్ళిచేస్తే జయిలులో పెడతారని బెదిరిస్తే ఆగిపోయాడు తాత.

ఆంజనేయులు తెలివైనవాడు. బాగా చదువుకొంటున్నాడు. అయ్యవార్లందరికీ ఇష్టుడు. అయినా మెతకమనిషి. భయస్థుడు, పిరికివాడు.

తాత ప్రేమకు ఆంజనేయులు దాసుడు. రత్నం ధయకు బందీ! దాసుడికి – బందీకి ఘర్షణ. ఒకసారి అటు, ఒకసారి ఇటు గెలుపు. ఆంజనేయులు నిమిత్తమాత్రుడు. గెలుపు ఓటములతో అతడి సంబంధం లేదు.

స్కూలు మాని కుంటకు పోయాడని, వారమైనా ఆంజనేయులు రాలేదని విని రత్నం నరిసినీకుండపోయి అతణ్ణి తీసుకొని వచ్చి హాస్టల్లో చేర్చాడు. తాత వస్తే కుంటకు పోతాడు. రత్నం పోతే హాస్టలుకు వస్తాడు. ఇద్దరు చెప్పినట్టూ వింటాడు. తనకేం ప్రమేయం లేదు. నిమిత్తమాత్రుడు. చదువులో ఫస్టు. నడతలో బుద్ధిమంతుడు.

పదో తరగతిలో స్కూలు ఫస్టు వస్తే తాత తల తిరిగిపోయింది. అంతమందిలో తన మనమడు మొనగాడంటే ముసలి మీసం నిక్కబొడుచుకొంది. తాత – మనమడు వచ్చి రత్నం కాళ్ళకు మొక్కారు.

తాత 'లగ్గం' అన్నాడు. రత్నం 'పోలీసులు' అన్నాడు. తాత నోరెత్తలేదు. ఆంజనేయులు ఇంటర్‌లో చేరాడు.

ఆదివారం తపోవనం వచ్చి రత్నం ఇంట్లో తాతను కలుసుకొనేది ఆంజనేయులు తగ్గించాడు. తాత హాస్టలుకు పోయి మనమణ్ణి కలుసుకొనేది మోపుచేశాడు.

మనమడి భోజనం, బట్టలు, పుస్తకాలు, స్కూలుఫీజు, తనకు అంతా తగ్గిపోయినందుకే కాదు, గవర్నమెంటు ఇస్తున్నందుకు ఎంతో ముచ్చటపడిపోతున్నాడు.

ఇంటర్‌లో ఉండగా బక్కప్రాణి ఉక్కుపిండంలా మారాడు, మొక్కలాంటి వాడు చెట్టులాగా అయ్యాడు. ముఖంలో పసితనంపోయి పురుషత్వం వస్తూవుంది. మూతిమీద మీసం గోటికి చిక్కుతూ ఉంది.

ఈ వయస్సులో తనకు పెళ్ళయిపోయి పెళ్ళాం కాపురానికి వచ్చిందనీ, మనమడి పెళ్ళి కూడా కాలేదనీ తాతకదో దిగులు. రత్నం అంటే భక్తి, భయం.

ఆర్ట్సులో అనంతపురంలోని అన్ని జూనియర్ కాలేజీలకంటే ఆంజనేయులు ఫస్టుగా

పాసయ్యాడని నలుగురూ చెప్పుకొంటుంటే నాయక్ కుంటకు, అనంతపురానికి, హాస్టలుకు తపోవనానికి నడవలేదు. పరుగులు తీశాడు. కాలు నిలవలేదు. మాట ఆపలేదు. ఆనందం పట్టలేక ఏడుస్తూ తిరిగాడు.

తాతా, మనమడు వస్తే 'పెళ్ళి వీల్లేదు, డిగ్రీ చదవాలి' అని రత్నం శాసిస్తే తాత నసిగాడు. మనమడు మెత్తబడ్డాడు. ఇద్దరూ భోజనం చేసి విశ్రాంతి తీసుకొని కుంటకు తాత, హాస్టలుకి మనుమడు వెళ్ళిపోయారు.

ఆంజనేయులు పద్దెనిమిదేళ్ళకే నిండైన విగ్రహంగా రూపొందాడు. అందమైన రూపం, చక్కనిరంగు, పొంగే ఉత్సాహం, ఎగిరిపడే తేజస్సు.

అతడు హాస్టల్లో తక్కువగా, రోడ్లు మీద ఎక్కువగా ఉంటున్నాడని విన్నాడు రత్నం. నొప్పి కలిగింది. ఆడపిల్లలతో టీలు, కాఫీలు కబుర్లు. ఖర్చులకు డబ్బులిస్తున్న ఉష.

'నువ్వు ఆడపిల్లల్ని ఆటలు పట్టిస్తూ ఏడిపిస్తున్నావని నాకు ఆనందంగా ఉంది' అన్నాడు రత్నం.

'నేనాడపిల్లల్ని ఏడిపించలేదు' అని ఆంజనేయులు ఏడ్చేశాడు.

'ఏడిపించవచ్చు. కానీ ఏడవకూడదు.' కళ్ళు తుడుచుకొన్నాడు.

'ఉషకు నువ్వెంత బాకీ!'

'ఊరికే ఇస్తుంది'

'మారకం ఊరికే జరగదు. డబ్బు ఇచ్చే మనిషికి నువ్వు తిరిగి చెల్లించవలసి ఉంటుంది. ఏదో ఒకటి'.

'తిరిగి అడగదు!'

'అడక్కపోయినా ఇవ్వాలి'.

'ఇవ్వలేను'

'తీసుకోవద్దు'

ఆంజనేయులు అడిగేశాడు. 'మీరిచ్చే డబ్బు?'

'బాకీ తీరుస్తున్నాను.'

ఎప్పుడు ఎవరికీ ఎందుకు రత్నం బాకీ పడ్డాడు? ఎందుకు తీరుస్తున్నాడు? రుణం ఇవ్వటమా? రుణం విముక్తుడు కావటమా? తాను రుణపడటం లేదు. రత్నం బాకీ తీరుస్తుంటే తాను రుణగ్రస్తుడు కాదు. రత్నం రుణం తీసుకొని తీరుస్తున్నట్లుగా ఉండకపోతే తాను రుణగ్రస్తుడే మరి అనుకొన్నాడు ఆంజనేయులు.

రత్నంకు కూతుళ్లు లేరు. కాబట్టి ఇది పెట్టుబడికాదు. కొడుకులున్నారు. పుత్రప్రేమకాదు. సంపన్నులు కాదు, అయినా సహాయం చేస్తున్నాడు 'ఈ దయకు?'

నీమీద నాకెన్నో ఆశలున్నాయి. ఇంతకాలం ఆంజనేయులు స్వేచ్ఛాజీవి. ఏమీ తెలియదు. ఏ సంకెళ్లు లేవు.

ఇప్పుడు తాత ప్రేమ రత్నం దయ సంకెళ్ళుగా మారాయి. తాను ఏం చేస్తే ప్రేమ దయలకు ప్రత్యుపకారం చేయగలడు? కృతజ్ఞత చూపగలడు?

ఇప్పటికి వాళ్లమాట వినటమే!

ఆడప్లిలలతో మాట్లాడటం మానేశాడు. ఉష డబ్బు తీసుకోవటం ఆపేశాడు.

'నీ తెలివి, నీ విద్య రూపంలో నీకు పెట్టుబడి, భవిష్యత్తు బాగుండాలంటే ఈ పెట్టుబడి మురిగిపోకూడదు.'

డిగ్రీ డిస్టింక్షన్‌తో పాసయ్యాడు ఆంజనేయులు. తాత 'లగ్నం' అన్నాడు. రత్నం వద్దన్నాడు. 'తాత ప్రేమను నేను కాదనను' అన్నాడు ఆంజనేయులు. 'నా ఆశ?' అన్నాడు రత్నం. 'నెరవేరుస్తాను' అన్నాడు.

తాత చెప్పినట్లు పెళ్ళి చేసుకొన్నాడు. రత్నం చెప్పినట్లు ఎం.ఎ.లో చేరాడు. శోభనం లేకుండా భార్యను బంధించకూడదంటే సరేనని శోభనానికి అంగీకరించాడు.

కాపురం పెట్టి 'భార్యకు దూరంగా ఉండి బాధించకూడ'దంటే కాపురం పెట్టడం మానేసి హాస్టల్లో చేరాడు.

పెళ్ళయిన యౌవనవతిని భర్త సుఖానికి దూరంగా ఉంచే హక్కు నీకు లేదంటే నరసినీకుంటకు పోయివస్తూ ఉన్నాడు.

అచంచల దీక్షతో చదవకపోతే విద్య వినాశనమౌతుందంటే భార్యను చూడకుండా చదవసాగాడు ఆంజనేయులు.

ఒకపక్క తాతా, భార్యా ఉన్నారు. మరోపక్క రత్నం ఒక్కడే అయిపోయాడు.

టగ్ ఆఫ్ వార్ తాడు ఆంజనేయులు.

రెండు ప్రేమల ముందు ఒక దయ, దాని ఆశ ఓడిపోయాయి.

ఎం.ఏ. ఫస్టు ఇయర్ పరీక్ష వ్రాసి ఇంటికి వచ్చిన ఆంజనేయులు సంసారం పెట్టాడు.

మంచి మార్కులతో పాసయ్యాడు.

రెండో సంవత్సరం హాస్టల్లో చేరలేదు.

తాతకి గాడిదలు, కట్టెలు ఆస్తిపాస్తులు. మామకి సారాయి బట్టీలు తిండీ తీర్థాలు.

ఆంజనేయులు సంసారం సాగటం కష్టమయింది. మూణ్ణెలకే హాస్టలుకు వచ్చి చేరాడు. కాలేజీకి పోతున్నాడు. బాగానే చదువుకొంటున్నాడు.

ఆకర్షణకు కేంద్రాలు పెరిగాయి. పేకులాటలకు ఆంజనేయులు లోనుకాసాగాడు.

'ఇంత పెద్ద చదువు చదివావు ఏ ఉద్యోగమూ రాదా?' అని అందరూ అడగసాగారు.

ఉద్యోగాల వేటలో చదువూ, సంసారం సాగిస్తూ ముక్కంటి అయ్యాడు ఆంజనేయులు.

అటెండరు ఉద్యోగాలు ఖాళీలు ఉన్నాయని, రత్నం చెవితే వి.సి. ఇస్తాడని ఎవరో ఆంజనేయులు చెవిలో ఊదారు. తాత బాగుండాలంటే భార్య బాగుండాలి. భార్య బాగుండాలంటే తనకు ఉద్యోగం ఉండాలి. తన కుటుంబం బాగుంటే చదువు బాగా సాగుతుందని భావించి రత్నంతో ప్రస్తావించాడు.

'నువ్వు లెక్చరరు ఉద్యోగం కంటే చిన్న ఉద్యోగం చేస్తే నా ఆశ తీరినట్లు కాదు. అంతకంటే చిన్నఉద్యోగం. నన్ను అడగవద్దు. నేనెవరికీ చెప్పను. ఇప్పించను' అని తేల్చిపారేశాడు.

ఈ సంవత్సరం గడిస్తే ఎం.ఏ. అవుతుంది. లెక్చరరు ఉద్యోగానికి ప్రయత్నించవచ్చు.

నువ్వు కాపురం పెట్టకపోతే దాన్ని కాకులూ, గద్దలూ తన్నుకుపోతాయని తాత సతాయింపు.

ఏం చేయాలి?

ట్రైబల్ వెల్‌ఫేర్ డిపార్టుమెంటులో వార్డెను పోస్టులు ఖాళీ పడితే దరఖాస్తు చేసి, కలెక్టర్‌ని కలిసి రిక్వెస్టు చేశాడు ఆంజనేయులు.

ఉద్యోగం వచ్చింది. కాపురం పెట్టాడు. తాతను తీసుకుపోయాడు.

హాస్టలు వార్డెను రూంలో భార్య తాతా ఉండలేమన్నారు.

దగ్గరలో ఇల్లు తీసుకొన్నాడు.

టెంపరరీ వార్డెను జీతం తక్కువ అద్దె ఇల్లు. ఇంటిఖర్చు జీతం బొటాబొటిగా సరిపోతుంది.

తప్పనిసరయి ఈ ఉద్యోగంలో చేరవలసి వచ్చిందని, ఎట్లా అయినా ఎం.ఏ. పూర్తిచేస్తానని రత్నంతో చెప్పాడు.

అతను మాట్లాడలేదు.

ఆంజనేయులు బతిమాలి బామాలి గోలపెట్టగా "నా ఆశతీరలేదు" అన్నాడు.

'మీ ఆశ ఏమిటి?' అడిగాడు ఆంజనేయులు

'కలెక్టరు కాదంటే కనీసం లెక్చరరు! అదీ నా ఆశ!'

'మీ ఆశ నెరవేరుతుంది!' అంటూ కాళ్ళకు నమస్కరించి హాస్టలుకు వచ్చాడు.

భార్యకు తానున్న ఊరునీరు పడలేదు.

తాతకు ఆవూరు సొంతూరులాగాలేదు. గాలి పడలేదు. ఈ ఊళ్ళో ఉండబుద్ధి కావటం లేదు.

హాస్టలు పిల్లలకు – తన వంటి వాళ్లకు అన్నీ సమకూర్చటం ఆంజనేయులకి సంతృప్తిగా ఉంది.

పిల్లల ప్రవర్తన నచ్చటంలేదు. ఒకరకం కాదు. పదోతరగతికే అన్ని అలవాట్లు! చూసి సహించలేక పోతున్నాడు. కోపంతో పిల్లల్ని కొట్టటం, వాళ్ళు సమ్మె చేయటం, కలెక్టర్ మందలించటం, పెద్దతలనొప్పిగా ఉంది. ఎలాగో ఓర్చుకొంటున్నాడు.

చేయరాని పనులు చేయమని పై ఉద్యోగులు సతాయిస్తున్నారు.

చేస్తే తన మనస్సు నొప్పి. చేయకపోతే పైవాళ్ళతో పేచీ, ఎందులోనో ఇరికిస్తారు.

ఆంజనేయుల్లో రత్నం ఉన్నాడు. 'అటువంటి పనులు చేయరాదు' అంటున్నాడు. తలకాయమీద తాత కూర్చున్నాడు. "నాలుగు దుడ్లు కావల్ల తిండితినల్ల తప్పులేదు" అంటున్నాడు. తాతనోరుమూయించి రత్నం మాట మన్నించి, ఉద్యోగం వదిలేసి, కాలేజీలో చేరతానని వచ్చి రత్నంతో చెప్పాడు.

మళ్ళీ ఎం.ఏ. రెండో సంవత్సరం పునః ప్రారంభించాడు ఆంజనేయులు ఊరు పడలేదు, నీరు పడలేదు, గాలిపడలేదు అన్న భార్య, తాత సుఖంగా స్వగ్రామం చేరారు.

నెలతప్పిన భార్య పుట్టింటికి పోయి ప్రసవమయి బంగారంలాంటి కొడుకును కని నరిసినీకుంటకు బయలుదేరుదామనుకొంటున్నప్పుడు ఆంజనేయులు ఎం.ఏ. రిజల్స్ వొచ్చాయి. యూనివర్శిటి ఫస్టు!

'నీ కొడుకును చూస్తాను' అని రత్నం అడిగితే ఆంజనేయులు తీసుకుపోయాడు.

పిల్లవాడు పసుపుపచ్చగా, బంగారు బొమ్మలాగా మంచి ఆరోగ్యంతో ఉన్నాడు.

బట్టలు, బొమ్మలు ఇచ్చి, 'నీ మనుమడి నీ పేరేనా?' అని భూక్యానాయక్‌ని అడిగాడు రత్నం. పిల్లవాడి తల్లి కలుగచేసుకొని, ఇంకోతాత పేరు 'రత్నం' అంది. 'ఏమిటీ'? అని రెట్టించాడు. 'రత్నం' అంది. మళ్ళీ కళ్ళలో నీళ్ళు తిరిగి రత్నం మెళ్లో ఉన్న బంగారు గొలుసు తీసి చిన్నరత్నం మెళ్ళోవేసి కళ్ళు తుడుచుకొన్నాడు.

'నన్నేం చేయమంటారు?' అని అడిగాడు ఆంజనేయులు

'ఎక్కడయినా లెక్చరరు ఉద్యోగం ఖాళీవస్తే చేరుదువు గాని. అందాకా రిసర్చిలో చేరు ఐ.ఎ.ఎస్. కి చదువుతూ ఉండు'

'సతికింది సాల్‌రా పాపోడా! ఇల్లూ వాకిలీ పట్టిండి ఆలుబిడ్డల్ని సాక్కో!'

చదువు – మాను ఆంజనేయుల్లో ఘర్షణ సంఘర్షణ.

'సదువంటే సస్తా! ఉరేసుకుంటా! లారీకింద బడతా. గూడుసుకింద తలబెడతా చూపించు'

'చదువు, కలెక్టరుకా, పేదల్ని ఆదుకో నలుగురికీ బతుకు దెరువు చూపించు'

'సస్తా'

'బతికించు!'

నేను చదువుతా నంటే భార్యతలూపింది. ఏడుస్తున్న తాత డొక్కలో దూరి, చెవిలో ఏమోచెప్పి, ఒప్పించి యూనివర్శిటీకి వచ్చి రీసెర్చిలో చేరాడు ఆంజనేయులు.

భార్య పుట్టింటికి పోయింది. భూక్యా నాయక్ రత్నం ఇంటికివచ్చి వేపచెట్టుకింద మంచం వేసుకొన్నాడు.

రత్నం పిల్ల లతన్ని తాతా! తాతా! అని పిలుస్తూ కథలు చెప్పించుకొంటున్నారు.

పిల్లవాడు గుర్తుకు వస్తున్నాడన్నాడు ఆంజనేయులు.

'పోయి చూసిరా' చెప్పాడు రత్నం

'నేను మీ రుణం తీర్చుకోలేను.మా తాతను కూడా మీరు సాకుతారనుకోలేదు' అన్నాడు ఆంజనేయుడు,

రత్నం కళ్లు తుడుచుకొన్నాడు.

'వంక సెవ్వోనికి తీరికేలేదా! నా కాడికి వచ్చేకి అబ్బదా?' అని అడిగాడు తాత రత్నాన్ని.

మర్నాడే ఆంజనేయులు వచ్చి తాతను పలకరిస్తే 'నా కీడ బాగుండాదిరా అబ్బీ' అంటే విని అటు తిరిగితే 'నువో కలకటేరు వయితావా? గవినేను వయితావా' అని

అడిగాడు. 'ముందుగా కలెక్టరు, ఆనక గవర్నరు' అన్నాడు. ఆంజనేయులు 'కారా నా బుడతడా! గవినేను కారా దొంగనాయాల' అని కళ్ళు తుడుచుకొన్నాడు తాత.

ఆంజనేయుల్ని హైదరాబాదు పంపి కోచింగు ఇప్పించాడు రత్నం.

మెయిను పరీక్షలు పూర్తయి ఇంటికివచ్చిన రోజున మనుమడి చేతుల్లో తృప్తిగా కళ్ళుమూశాడు తాత.

ఆంజనేయుల్ని చేతుల్లో పెట్టుకొని పెంచి, గుండెల మీద పెట్టుకొని నిద్రపుచ్చి, తనకున్నది తాను తినకుండా పెట్టిపోషించి అంతా ప్రేమే అయిన తాత భూక్యానాయక్ కాలంచేస్తే కాళ్ళూ చేతులు ఆడక గిలగిలలాడాడు మనుమడు.

భార్యను, కొడుకును ఓదార్చి, ఇంటర్వ్యూ సంసిద్ధతకు ఢిల్లీ వెళ్ళిపోతున్న ఆంజనేయుల్ని, ఉదయిస్తున్న సూర్యుణ్ణి చూస్తూ నిలబడ్డాడు రత్నం.

ఆంజనేయులు ఇంటిలో అతడి భార్యను, పిల్లవాణ్ణి దించి, అతణ్ణి ముద్దు పెట్టుకొని 'నా ఆశతీరింది' అనే ప్రొఫెసర్ రత్నం ముఖంలోకి చూస్తూ బావురుమని ఏడ్చాడు.

ప్రొఫెసర్ రత్నం రిటైరు అవుతున్నరోజు భార్య ఇద్దరు పిల్లలతో వచ్చిన కలెక్టర్ ఆంజనేయులు రత్నం కాళ్ళమీదపడి ఏడుస్తూ 'నా తండ్రీ నా తండ్రీ! మా తండ్రీ! మా దేవుడా! నీ దయకు రిటైర్‌మెంటు లేదు' అంటూనే ఉన్నాడు.

❀